# విధి వక్రించింది:

రచన :
శ్రీ. వేదుల గోపాలకృష్ణమూర్తి.

అది నిశీథి. చీకటి వెలుగులతో తనకి సం బంధం లేనట్లు, ప్రయాణీకులను వారి వారి గమ్యస్థానాలను చేర్చడమే తనవిధి అన్నట్లుగా మద్రాసు పోయే ఎక్స్‌ప్రెస్ తుని నుంచి కదిలింది. రకరకాల మనుష్యులను అది తీసుకొని వెళుతోంది. సంతోషవదనులు, విచారవదనులు, ఎప్పుడూ ఏదో ఆలోచించే వారు, యాత్రలు వెళ్లేవారు. ఆ పెట్టెలోనే ప్రయాణం చేస్తున్నాడు రఘు. ఏదో ఆలోచన.

'మిస్టర్, లెట్ మిసీ యువర్ టికెట్' అడిగాడు T T E రఘు నుద్దేశిస్తూ. షర్టు మడతలో పెట్టిన టిక్కెట్టు తీసి చూపించాడు రఘు. టిక్కెట్టుపై సంతకం చేసి యిచ్చేస్తూ—

'ఏమండీ మీది విశాఖపట్నం కదూ?' అడిగాడు T T E రఘును చూస్తూ.

'అవునండీ, అక్కడ చదువుకున్నా. కాని మా స్వంత ఊరు తుని' అంటూ T T E వైపు తిరిగాడు రఘు. ఆశ్చర్యం! తను చూస్తున్నది T T E ని గాదు. ఆ డ్రస్సులో ఉన్న తన మిత్రుణ్ని.

'హల్లో జగ్గూ' ఉత్సాహంతో జగన్నాధ స్వామిని అక్కున చేర్చుకొన్నాడు రఘు. ఒకసారి తన బాల్య స్మృతులు మదిలో మెదిలాయి.

అది వారిద్దరూ విశాఖపట్నంలో థర్డుఫారం చదివే రోజులు. ఒకనాడు రఘు తెలుగు నోట్సు తేవటం మరచిపోయాడు. అందుకని మాష్టారు రఘుని చితక బాదారు. అది సహించలేక ప్రక్క బెంచీలో కూర్చున్న జగన్నాధస్వామి ఆయన్ని ఎదిరించాడు. కాని నాలుగు అతనికి కూడా వడ్డించారు తెలుగు మాష్టారు. అది మొదలుకొని వారు అతి సన్నిహితులయ్యారు. వారిద్దరికే ఎప్పుడూ ఫస్టు, సెకెండు, మార్కులొచ్చేవి.

'రఘూ, ఏమిటిరా ఆలోచిస్తున్నావ్'

'అబ్బే, ఏంలేదురా III rd ఫారంలో మాష్టారు కొట్టిన సంఘటన జ్ఞప్తికి వచ్చింది. అంతే.

'భలే ఏడిపించాములా. అసలు నువ్విప్పుడేం చేస్తున్నావ్'

'అప్పట్లో పై చదువులు చదవలేకపోయా. ఇప్పుడు తుని తాలూకాఫీసులో గుమస్తాగిరి వెలిగిస్తూ కూపస్త మండూకంలా ఉన్నా'

'ఏరా ఈ మధ్య కథలు ఏమీ వ్రాయటం లేదా?'

'ఏం. కథలురా. నాకథ వినేవాడెవడు అంటూ బాధగా నిట్టూర్చాడు రఘు. ఏదో బాధ పడుతున్నాడని గ్రహించాడు T T E.

'అదేమిటి, అంత విచారంగా ఉన్నావ్, ఏం జరిగిందిరా?'

మౌనంగా జేబులోని టెలిగ్రాం తీసి యిచ్చాడు. టెలిగ్రాం చదివి ''అయ్యో, నీ మిసెస్‌కి సీరియస్సా'' అన్నాడు కంగారుగా. మళ్లీ 'మరేం, ఫర్వాలేదురా' అంటూ ఓదార్చాడు రఘుని.

'అసలే Delivery Time రా. ఎలాగుం టుందో, ఏమిటో'

'ఆఁ మరేం worry అవకు. అందులో కాకినాడ కదా, పెద్దాసుపత్రిలో చేర్చే ఉంటారు.' కులాసాగా ఉంటుందిరా.

పిఠాపురంలో ట్రయిను ఆగింది.

'వస్తారా రఘూ, డెలివరీ అయినాక ఉత్తరం వ్రాయి.' అని ఎడ్రసు యిచ్చి దిగిపోయాడు T T E జగన్నాథస్వామి.

ట్రయిను కదలబోయే సమయంలో ఎవరో ఒకామె చిన్న పిల్లవాడితో రఘు కూర్చున్న పెట్లో ఎక్కింది. ఆ చంటి పాప బోసి నవ్వునవ్వింది. అంతవరకూ విచారిస్తున్న రఘు పాపకేసి చూస్తూ తనూ నవ్వాడు. సామర్లకోటలో దిగి మరొక బండిలో కాకినాడ చేరుకొన్నాడు రఘు. పిఠాపురంలో ఎక్కిన ఆమెకూడా కాకినాడేవచ్చింది. ఆమె నెక్కడో చూచినట్లు జ్ఞాపకం, కాని అడగలేకపోయాడు. స్టేషనులో రిక్షా ఎక్కి రామారావు పేటలోనున్న అత్తారింటికి చేరుకున్నాడు. రిక్షాలో కూర్చున్నంత సేపూ ఏవో పాడు ఆలోచనలు...

అత్త రాజేశ్వరి కన్నీళ్ళతోనే తలుపు తీసింది. అతను గతుక్కుమన్నాడు. ఏమయిపోయిందోనని కంగారుపడి.

'అత్తయ్యా ఏమయింది' రఘు కంఠస్వరం బొంగురు పోయింది.

'నాయనా రఘు. గంట క్రితమే పురుడొచ్చింది. ఆడపిల్ల. కాని అప్పటినుంచి శాంత పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. ఇప్పుడే డాక్టరు మందిచ్చివెళ్ళారు. ఈ ఒక్కరాత్రి గడస్తే గండంగడచినట్లే' ఆమె ప్రతీమాట అతి బాధగా చెప్పింది. కన్న ప్రేమ మరి. ఈ మాట విని మరీకుదేలయిపోయాడు రఘు. మామగారు సుబ్బయ్య పలకరించినా వినిపించుకోలేదు.

'శాంత ఎక్కడుందత్తయ్యా?'

'అదుగో, ఆ గదులో' చెప్పింది అత్త రాజేశ్వరి హీనస్వరంతో. గబగబా గదికేసి పరిగెత్తాడు రఘు. గదులో మంచంపై శాంత యిటూ, అటూ బాధగా దొర్లుతోంది. చంటి పాప బోసిగా నవ్వుతోంది. శాంతను చూడగానే దుఃఖం కట్టలు త్రెంచుకొంది.

'శాంతా, శాంతా' అని మెల్లగా పిల్చాడు రఘు. ఆమె మెల్లగా కళ్ళు తెరిచింది. ఒక చిరునవ్వు ఆమె కళ్ళతోనే ఏదో అడిగింది. ఆ మూగ భాషను అర్థంచేసుకొన్నట్లుగా రఘు క్రిందనున్న మంచినీటి గ్లాసును తీసి నోట్లో కొద్దిగా పోసాడు. కొన్ని నీళ్ళు త్రాగి ఆమె కళ్ళతోనే వద్దని వారించింది. నూతులో మాట్లాడినట్లుగా' మీరు... మళ్ళీ... పెళ్ళి...చే...సు...కో...ం...డి' చెప్పింది అతి బాధతో శాంత.

'మరేం ఫర్వాలేదు శాంతా నేనున్నాగా. ఇప్పుడే డాక్టరుగారికి కబురు పంపా. నీకు తప్పకుండా నయమవుతుంది'' అన్నాడు గద్గదస్వరంతో.

మానవుడు అవతల కొంప కూలిపోతున్న సమయంలో దేవున్ని ప్రార్థిస్తాడు. అతనువచ్చి అడ్డుతాడేమోనని. అది దేవుడు నిర్ణయించిన దేనని ఆ సమయంలో తలపై రానేరాదు.

'అమ్మా' అని భయంకరంగా అరిచింది శాంత. ఆమె బాధనర్థం చేసుకొన్నట్లుగా భగవంతుడు ఆమెకు శాశ్వతంగా 'అమ్మా' అనకుండా చేశాడు. ఎవరో కొట్టినట్లుగా చంటిపాప కెవ్వుమంది. తీతుక అదే సమయంలో భయంకరంగా అరుస్తూ ఆ యింటిపై నుంచిపోయింది. అందరూ గొల్లుమన్నారు.

\+ + +

కొన్ని రోజులు కాల చక్రంలో దొర్లిపోయాయి. చంటిపాపను తీసుకెళతానన్నాడు రఘు. అత్తమామలు వద్దన్నారు, కాని అతని పట్టుదల చూచిన వెనుక కాదనే ధైర్యం వారికి లేకపోయింది. కొందరు పెద్దలు మళ్ళీ పెళ్ళి చేసుకోమన్నారు. చనిపోతూ 'శాంత' కూడా అదే చెప్పిందని 'సరే' నన్నాడు. రఘు ఆఫీసుకి సెలవుపొడిగిస్తూ దరఖాస్తు చేశాడు. కొద్దిరోజులలో 'రమ' తో వివాహం జరిగిపోయింది. రమ శాంతకు ఏదో దూరబంధువు కూడాను. పెళ్ళి అయిన వెంటనే తిరిగి ఉద్యోగంలో జాయిను అయి

DEPENDABLE PLACE
For DELIGHTFUL
DRESS GOODS

BENARES,
BANGALORE, **SAREES**
BENGAL, etc.
SILK of EVERY STYLE, HANDLOOM COTTON SAREES, DHOTIES and other Clothing Materials.

ALL OF THE HIGHEST QUALITY

**S. R. B. Kuppuswamy Iyer & Son,**
(Formerly :—S. R. BALUSWAMY IYER & SONS)
**230, East Marret Street, Madurai** Phone : 2036
**117, Nyneappa Naick Street, P. T. Madras** Phone : 32206

నాడు. పాప కొంచెం, కొంచెం పెద్దదయింది. రమ కాపురానికొచ్చింది. రమను చూస్తే పాపకెంతో సంతోషం. 'పిన్నీ' అని ముద్దుగా పిలిచేది. కాని రమకు, పాపంటే చిరాకు, కోపం. రఘు లేనప్పుడల్లా పాపను కొడుతూ, తిడుతూ, పాలుసరిగా పొయ్యక చేస్తూ ఉండేది. కొన్నాళ్ళ తర్వాత ఇది తెలిసి రఘూయే తన కర్మను తిట్టుకుంటూ పాపకు పాలు, స్నానం చేయించటం మొదలుకొని అన్నిపనులు చేసేవాడు. ఒకనాడు ఆఫీసు పనిపై బెజవాడ వెళుతూ 'పాప' ను జాగ్రత్తగా చూడమని మరీ, మరీ చెప్పివెళ్ళాడు రమతో. ముఖావంగా 'సరే' నంది రమ.

REGD.1674.05
B.K.C
TRADE MARK
BANIANS
బి. కె. సి. బనియన్లు

బి. కె. సి. బనియన్లనే
ఎల్లప్పుడూ ఆయన కొరకు
ఆమె ఎన్నుకుంటుంది.
SOLE PROPRIETOR: M. MAGBOOL.
BANSILAL KNITTING CO.,
DEVJI COLONY
TIRUPUR

బెజవాడ క్యాంపునుండి తిరిగి తుని బయలు దేరాడు రఘు. ఆఫీసు పని అయినాక పాపకోసం బిస్కట్టు, ఎన్నో ఆడుకొనే వస్తువులు కొన్నాడు.

'నాకు శనిలా దాపురించావ్ ఛీ' అంటూ అక్కడున్న కర్రవిసిరింది రమ పాపపై. అప్పుడే గుమ్మంలో అడుగుపెట్టిన రఘు ఆ దెబ్బకు గురయ్యాడు! తలపై బలంగా గాయం తగులటచే రక్తం బాగా కారింది. పరి, పరి విధాల చింతించి అప్పటికప్పుడే పాపను తీసుకొని యింట్లోంచి వెళ్ళిపోయాడు రఘు. ఒకనాడు ఆఫీసు ఎడ్రసుకి ఒక ఉత్తరంవచ్చింది. అందులో...

మిస్టర్ రఘు!

నిజం చెప్పాలంటే మొదటినుంచీ నువ్వంటే నాకిష్టంలేదు. ఏదో తల్లిదండ్రుల బలవంతం మీద రెండో పెళ్ళివాణ్ణి చేసుకొన్నా. ఆ చిన్నరాక్షసి అంటే నాకు మరీ కోపం. నువ్వు దానితో ఇల్లు అద్దెకు తీసుకొని ఉన్నావని తెలిసింది. ఆ వేళ నా ప్రియుడు శంకర్ వచ్చాడు. నే నిప్పుడు అతనితో ఉంటున్నా..

ఇంకా ఏదో చాలా వ్రాసింది. అంతకు మించి చదవలేక పోయాడు. కసిగా ఆ ఉత్తరం ముక్కముక్కలుచేసి కాళ్ళతో త్రొక్కివేశాడు. 'ఛీ! లోకంలో ఇలాంటివాళ్ళు ఇంకా బ్రతికున్నారా' అస విచారించాడు. ఆ పాపను తను ఎక్కడికి వెళితే అక్కడికే తీసుకెళ్ళేవాడు. అప్పటికి పాపకి 2 వ సంవత్సరం వెళ్ళి మూడు ప్రవేశించింది. కొన్నాళ్ళు సెలవుపెట్టి

అలా తిరుపతి, మద్రాసు చూడడానికి పాపతో బయలు దేరాడు. తిరుపతి యాత్రముగించుకొని మద్రాసు చేరుకొన్నాడు ట్రయిన్‌లో. సెంట్రల్ స్టేషనులో దిగి మైలాపూరు తన బాల్య స్నేహితుడు మురళీదగ్గరకు వెళదామని సిటిబస్సు స్టాపీలో నించున్నాడు పుత్రికాసమేతంగా. ఇంతలో అవతల foot path పై మురళియే కనిపించాడు. వెదుకపోయిన తీగ కాళ్ళకు చుట్టినట్లయింది. 'మురళీ' అని పిలిచి, పాప నెత్తుకొని గబగబా నాలుగడుగులు రోడ్డుపై వేశాడు. అంతే! వేగంగా వస్తున్న టాక్సీ వచ్చి గుద్దింది. అతను రోడ్డు ప్రక్కకు పడిపోయాడు. ఆ పాప ఫ్రంటు టయిర్ క్రిందపడింది. అతనికి బాగా గాయాలు తగిలాయి. గాయాలుతో బాధపెడుతున్నా పాప కోసం మెల్లగా లేచి అటూ యిటూ చూశాడు. అంతే ఆ భయంకర దృశ్యం చూడ లేక పోయాడు. రక్తమడుగులో పాపశరీరం వికృతంగా ఉంది. అతను ఇంకా శాశ్వతంగా ఆ రోడ్డుమీాదనుంచి లేవలేక పోయాడు. కరుణాసముద్రుడైన ఆ భగవంతుడు పుత్రికా మరణంవల్ల రఘు పడుతున్న బాధ చూడలేక




తనతో తీసుకుపోయాడు. అక్కడ కూడిన జనంలో దుఃఖించని వారంటూ లేరు.

ఎప్పటికి ఏది జరగాలో అదే జరిగిపోయింది. రఘుపై పగబట్టిన విధి వక్రించి ఒక్కసారిగా అతనిని అతని కుమార్తెను నాశనం చేసింది. అతని మిత్రుడు మురళి కర్మకాండ పూర్తిచేశాడు.

తునిలో పుట్టిన రఘు, కాకినాడలో పుట్టిన పాప, మద్రాసులో మట్టిలో కలిసిపొయ్యారు. ఇంక వారిద్దరూ తిరిగిరారు—రాలేరు కూడా.

